


## ఓ టాఫ్ థేంక్స్!

సభ గొప్పగా జరిగినా, నీరసంగా ఏడ్చినా చివర్లో ఓటాఫ్ థేంక్సనే ముక్తాయింపు తప్పని సరిగా వుంటుంది. తెలుగులో వందన సమర్పణ అంటారు. ఎప్పుడు పుట్టిందో, ఎక్కడ పుట్టిందో కాని ఇదొక ఆచారంగా చలామణి అవుతోంది. నన్నడుగుతే వందన సమర్పణలు గొప్ప ఫార్సుగా వుంటాయని చెబుతాను. ఇక ముందు ఏ సభకయినా వెడితే ఓటాఫ్ థేంక్సని శ్రద్ధగా వినండి. హాయిగా నవ్వుకోవచ్చు.

ఓటాఫ్ థేంక్స సమయానికి ప్రేక్షకులంతా నీరసపడిపోయి వుంటారు. కొందరు హాల్లోంచి పరుగెత్తుతారు కూడాను. ఓటాఫ్ థేంక్స చారులో కరివేపాకు వంటిది. వుంటే బాగుంటుంది. వున్నా పట్టించుకోరు.

ఓటాఫ్ థేంక్స్‌ని కొంచరు రాసుకొచ్చి చదువుతారు. ఇంగ్లాండ్లో ఎవరి పేరు మరిచిపోతే ఏం గొడవవుతుంతోనని వాళ్ళ భయం. చదివే మనిషి స్టైల్‌గా వుండి, మంచి గొంతుకూడా వుంటే కొంతలోకొంత బెటరు. చదువుతున్నప్పుడు అక్షరాలు కనిపించక తత్తరపాటు పడినా, కీచుగొంతైనా జనం నుంచి వచ్చే హాహాకారాలు మీరు వింటేనే బావుంటుంది. రాసుకొచ్చి చదివితే మెచ్చుకోరనే బెంగతో కొందరు అశువుగా చెప్పడానికి ప్రయత్నం చేస్తారు. ఇట్లాంటి ప్రయత్నాలు నికరంగా తొంభై శాతం దెబ్బ తినేస్తాయి.

సంస్థ అనండి, సమాజమనండి. మీ యిష్టం. అందులో కొన్ని పెద్ద తల లుంటాయి. అందరూ వుపన్యాసాలు చేయాలంటే కుదరదు. అందుచేత ఉపన్యాసం చేయడానికి వీల్లేని పెద్దకి ఓటాఫ్ థాంక్స్ తగులుకుంటుంది. సాధారణంగా ఈ బాధ్యతని సెక్రటరీగారి నెత్తిన పెడతారు. సదరు సెక్రటరీ సభకి రెండు రోజుల ముందు నుంచీ ఓ టాఫ్ థాంక్స్‌ని రిహార్సల్సు చేస్తుంటాడు. ఆ రోజుకి లాల్చీ పైజమాలో వుంటే బావుంటుందో, అద్దె సూటు తొడుక్కుంటే గ్లామరో అంచనాలు వేసుకుంటాడు. నిలువుటద్దం ముందు నించుని చేతులూపుకుంటూ, ముక్కు తుడుచుకుంటూ రకరకాల ఆంగికాలను ప్రాక్టీసు చేస్తాడు. ఆంగికం, సంభాషణ రెండూ సమానంగా వున్నాయో లేవో నిలువుటద్దం చెబుతుంది. అంతవరకూ అతని దీక్షను మెచ్చుకోవలసిందే.

సభ జరిగే రోజు రానే వస్తుంది. కార్యక్రమం మొదలైన దగ్గర్నుంచీ ఓ థేం (ఓటాఫ్ థేంక్సు) గారికి దడ ప్రారంభమవుతుంది. అయిదుగురో ఆరుగురో సభనిబట్టి వక్తలు ఉపన్యాసాలు దంచేసి ప్రేక్షకుల ప్రాణాలు తీసేస్తారు. ఓర్చుకోలేని ప్రేక్షకులు కొందరు పారిపోతారు. మిగిలి పోయిన ప్రేక్షకులు ఇష్షో అష్షో అంటూ ఆపసోపాలు పడుతుంటారు. మీటింగిక్కడ్తో



కథా నిలయం

ఆపేసి, నాటకమో, నాట్యమో ప్రారంభిస్తే బావుండిపోనని ఏకాభిప్రాయానికి వచ్చేస్తారు. అందువల్ల హాల్లో కలకలం పుడుతుంది. ఆ గోలని గమనించ గానే ఓథేంగారి కాళ్ళు వణుకుతాయి. చివరికి ఆయనగారి వంతు వస్తుంది. మైకు ముందర నించుంటాడు. గత రెండు రోజులుగా ప్రాక్టీసు చేసిన పాఠం గుర్తుకు రాదు. మైలురాయికి మల్లే రెండు నిముషాలు మాటా, పలుకూ లేకుండా నిలబడిపోతాడు. తొందరగా లాగించు గురూ, అని హెచ్చరిస్తారు జనం. ధైర్యం తెచ్చుకుని పాఠం ప్రారంభిస్తాడు.

జనం గోల చేస్తూనే వుంటారు. ఓ థేం గారు చిలక పలుకులు పలుకుతూనే వుంటారు. ఒకరిద్దరి వ్యక్తుల పేర్లు మరచి పోతాడు. వెనక నుండి ప్రామిటింగ్ వస్తుంది. ఖంగార్లో మునిగిపోయి, సభకిరాని వక్తని కూడా వచ్చినట్టుగా భావించి, వానిని కీర్తిస్తాడు. వారు రాలేదు బాబోయ్ అని హాల్లో ఎవరో జ్ఞాపకం చేస్తారు. తప్పు దిద్దుకోలేక పిచ్చి నవ్వొకటి నవ్వే స్తాడు. ఓటాఫ్ థాంక్స్ చివర్లో వుండగా హాలు అద్దెకిచ్చిన ఆసామి గురించి చెప్పమని ఒక పక్కనుంచి కార్యకర్త హెచ్చరిస్తాడు. ఆ పేరేమిటో గుర్తు రాక, బిక్కమొహం పెడతాడు. ఓ థేం, కుర్చీలు, బల్లలు సప్లయి చేసిన మనిషినికూడా వదిలి పెట్టొద్దని మరోవేపు నుండి మరో కార్యకర్త గట్టిగా అరుస్తాడు. చచ్చిన చావవుతుంది ఓ థేం కి.

ఓటాఫ్ థేంక్స్ ఏ సభలో నయినా ఒకే విధంగా వుంటాయి పడికట్టు పదాలు. మేము పిలవగానే ఎన్ని పనులున్నా సభకు విచ్చేసిన అధ్యక్షులు ఫలానాగారికి మా హృదయ పూర్వకమైన కృతజ్ఞతలంటూ ప్రారంభమయ్యే కర్మకాండలో బొత్తిగా వెరైటీ వుండదు. ఎన్ని పనులున్నా అని ఒక వక్తకి వాడితే, ఎంతో బిజీగా వుండికూడా అని మరో వక్తకి తగిలిస్తారు. ఎన్నో కార్యక్రమాలలో తల నిండుగా మునిగి వుండికూడా అని ఒకర్ని స్తుతిస్తే, అడిగిందే తడవుగా అని మరొకర్ని పొగుడుతారు. ఆ మాటకొస్తే వక్త

ఎవరికీ పనీ పాటా వుండదు. అందరూ తీరుబడిగానే దొరుకుతారు. ఆ మాటంటే బాగుండదని వత్తిడి పనులూ....తీరుబడి లేకపోయినా అంటూ విశేషణాలు వల్లిస్తారు. అయితే యిక్కడో పాయింటుంది. వచ్చిన వక్తలను అట్లాంటి విశేషణాలతో గౌరవిస్తున్నామని ఓ థేం గారు అనుకోవచ్చు. నన్నెవడైనా పిలుస్తే వాలిపోతాననే వక్తల వుద్దేశాల్ని బట్టబయలు చేస్తున్నామని ఓం థేంగారు గానీ, వేదిక నలంకరించిన వక్తలుగానీ అర్థం చేసుకోకపోవడం శోచనీయం. ఎన్నో పనులున్నా వచ్చేరంటే ఏమిటర్థం?........ మైకుమీద వ్యామోహం మనిషిని నిలువనీయడం లేదని సుళువుగా చెప్పవచ్చు గదా !